క్లుప్తంగా

తాగునీటి కుళాయి పనులు ప్రారంభం



కుళాయి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

లావేరు: మండలంలోని గుమడాం పంచాయతీ పరిధి నాగంపాలెం గ్రామానికి జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు వేయడానికి నిధులు మంజూరు కావడంతో మంగళవారం ఉప సర్పంచ్ డి.ధర్మారావు, జగ్గరోతు తవిటినాయుడు పనులను ప్రారంభించారు. ఈ పనులు పూర్తయితే గ్రామంలో తాగునీటి సమస్య ఉండదన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

80 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

లావేరు, ఎచ్చెర్ల: కంటి వ్యాధులను నిర్లక్ష్యం చేయవద్దని మురపాక హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం శాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు తేనేల విద్యాసాగర్, పెయ్యల లక్ష్మణరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తేనేల మంగయ్యనాయుడు జ్ఞాపకార్థం మురపాకలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని హెచ్‌ఎం, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రారంభించారు. 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 25 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు.

సామాజిక బాధ్యత అవసరం



ర్యాలీలో పాల్గొన్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ బాలాజీ, విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో సామాజిక బాధ్యత ఉండాలి శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ అన్నారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మంగళవారం జాతీయ సేవాపథకం, విద్యార్థుల సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో వికసిత్ భారత్-2047 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లో ర్యాలీ చేపట్టారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలన్నారు. ప్రపంచంలో ఉత్తమ వనరులు ఉన్న దేశంగా భారత్ మారిందన్నారు. భవిష్యత్‌లో సాంకేతికంగా, పారిశ్రామికంగా అత్యున్నత స్థాయికి చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ఎం.రామకృష్ణ, డీన్ కె.మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

సంతోషిమాతకు పూజలు



పూల అలంకరణలో సంతోషిమాత

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషి మాత అమ్మవారి ఆలయంలో ఆమావాస్య మంగళవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మూలవిరాట్టుకు అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ప్రత్యేక అలంకరణలో విజయగణపతి



పూజలందుకున్న విజయగణపతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో వేంచేసిన విజయ గణపతి ఆలయంలో మంగళవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

అందుబాటులో ఉండాలి

ఎచ్చెర్ల: గ్రామాల్లో ఆశ కార్యకర్తలు అందుబాటులో ఉండి వైద్య సేవలను అందించాలని హెల్త్ సబ్‌యూనిట్ అధికారి సూర్యం తెలిపారు. ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆశ కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారుల పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలను చేయించి అవసరమైతే స్థానిక వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. వైద్యాధికారి ఉషాశ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



ఎచ్చెర్ల క్యాంపస్: రణస్థలం మండలం మరువాడలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్, రణస్థలం: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మరువాడ గ్రామ సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, ప్రగతి నివేదిక ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటు తరువాత సమూల మార్పులు వచ్చాయన్నారు. ప్రతి అర్హునికీ ఇంటి వద్దకే ప్రభుత్వ పథకం చేరుతుందన్నారు. రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రికి కావాలన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, పార్టీ మండల అధ్యక్షులు మహంతి పెద్దరామినాయుడు, మండల యూత్ అధ్యక్షుడు జక్కంపూడి బంగారాజు, సర్పంచ్ జక్కంపూడి అచ్చిబాబు, ఎంపీటీసీ ఉప్పాడ అప్పన్న పాల్గొన్నారు.



జి.సిగడాం: సంతవురిటిలో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

సంతవురిటిలో..

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గార: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించగలిగామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు అన్నారు. అంపోలు పంచాయతీ లింగాలవలస సచివాలయం వద్ద ఎంపీపీ గొండు రఘురామ్ ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విజయవంతమైందన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదం లేకుండా అర్హులందరికీ అందించాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, సర్పంచ్ గొండు జయరాం, ఎంపీడీవో సంజీవి రమణయ్య, మండల పార్టీ కన్వీనర్ పీస గోపి, ఎంపీటీసీ సభ్యులు ముద్దాడ గోవిందరావు, పాదిలాపు రామజోగి, వైస్ ఎంపీపీలు అందవరపు బాలకృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, కొయ్యాన నాగభూషణం, సుంకాన సురేష్, అంబటి చినబాబు, శిమ్మ ధర్మరాజు పాల్గొన్నారు.



గార: సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న రామ్‌మనోహర్ నాయుడు తదితరులు

పారదర్శకంగా ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ పద్మావతి

ఎచ్చెర్ల క్యాంపస్, రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించి పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందిస్తున్నట్లు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, కొవ్వాడ అణువిద్యుత్ కేంద్ర స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి అన్నారు. రణస్థలం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల, రణస్థలం, లావేరు, జి.సిగడాం మండలాల తహసీల్దార్లు, ఓటర్ల జాబితా పర్యవేక్షణ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాలు పక్కాగా సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అక్టోబర్ 10 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు స్వీకరించిన ఫారాలు 6, 7, 8 పూర్తి వివరాలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేస్తున్నట్లు చెప్పారు. ఫారాలపై పూర్తి విచారణ నిర్వహించిన తరువాతే ఓటు హక్కు కల్పించటం, బదిలీ, తొలగింపు వంటి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఒకరికి ఒకే ఓటు ఉండటం, అర్హులకు మాత్రమే ఓటు హక్కు కల్పించటం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, మురళీధర్‌బాబా, టీడీపీ నాయకులు కనకారావు, రమేష్, కాంగ్రెస్ నాయకుడు సింహాద్రి నాయుడు, బీఎస్పీ నాయకుడు జి.రామారావు హాజరయ్యారు. తహసీల్దార్లు టి.సత్యనారాయణ, పప్పల వేణుగోపాలరావు, ఎన్నికలు డీటీ జి.కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల క్యాంపస్, రణస్థలం: రణస్థలంలోని ఐటీరీస్ పాఠశాల విద్యార్థులు విరాళాల రూపంలో రూ.50 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని దివ్యాంగులకు సహకారం అందజేస్తున్న రాగ నేత్ర ఫౌండేషన్‌కు అందించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, యాజమాన్య ప్రతినిధులు మంగళవారం అభినందించారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభించిన దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ముద్దాడ సచివాలయం నుంచి రుప్పపేట వరకు కిలో మీటరు మేర తారు రోడ్డు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. రూ.1.20 కోట్ల నాబార్డు నిధులు మంజూరయ్యాయి. పంచాయతీరాజ్ డీఈ ధర్మారావు పనులను మంగళవారం పర్యవేక్షించారు. స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

నైరా విద్యార్థుల ఫీల్డ్ విజిట్



వ్యవసాయ పథకాలను విద్యార్థులకు వివరిస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: నైరా వ్యవసాయ కళాశాల మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మంగళవారం ఫీల్డ్ విజిట్ చేశారు. ఇందులో భాగంగా నైరా గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. వీరికి ప్రభుత్వం ద్వారా రైతులకు అందుతున్న సంక్షేమ పథకాలను మండల వ్యవసాయాధికారిణి ఉషాకుమారి వివరించారు. అలాగే పొలంబడి కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు చంద్రమౌళి ఉన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



పూజలందుకున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని నక్కవీధిలో ఉన్న ఉమాజఠలేశ్వరస్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అభిషేకాలు చేశారు. స్వామివారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు.

పాస్టర్లకు వస్త్రదానం



పాస్టర్లకు వస్త్రాలు అందజేస్తున్న దృశ్యం

గార: క్రిస్మస్ ముందస్తు వేడుకల్లో భాగంగా గార మండల కేంద్రంలో ఏసుక్రీస్తు మహిమ మందిరంలో మంగళవారం జిల్లాలోని వంద మంది పాస్టర్లకు సంస్థ ప్రతినిధులు వస్త్రదానం చేశారు. పాస్టర్ల దంపతులకు జోషఫ్ అబ్దుల్ దంపతులు చేతుల మీదుగా వీటిని అందించారు. జోషఫ్ అబ్దుల్ మాట్లాడుతూ.. క్రిస్మస్ వేడుకలు ఆనందం జరుపుకోవాలని, క్రీస్తు మహిమలను తెలియజేయాలన్నారు. ప్రేమ, క్షమత్వంలు క్రీస్తుతత్వంలో ఉన్నాయని, అందరం సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమన్నారు. ప్రత్యేక ప్రార్థనలు అనంతరం అన్నదానం నిర్వహించారు. ఏసుక్రీస్తు మహిమ మందిరం బిషప్ బి.జాషువా దంపతులు, విజయకుమార్, రాజశేఖర్, శ్యామ్‌కుమార్, స్టీవెన్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నాయీబ్రాహ్మణులంతా ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రొతు శంకరరావు అన్నారు. అరసవల్లిలో మంగళవారం నాయీబ్రాహ్మణ కుల వనసమారాధనను నిర్వహించారు. ఈ సందర్భంగా పలుపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ అరవింద్, కొరుపూరు గజపతిరావు, తాడివలస కొండలరావు, కన్నయ్య, కృష్ణప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న మహిళా సంక్షేమ కార్యదర్శి కామేశ్వరి

లావేరు: మండలంలోని తాళ్లవలస గ్రామంలో గల సచివాలయం వద్ద మంగళవారం బాల్య వివాహాలపై గ్రామ సభ ఏర్పాటు చేశారు. తాళ్లవలస గ్రామ సచివాలయం మహిళా సంక్షేమ కార్యదర్శి ఎస్.కామేశ్వరి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే తెలియజేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి



డాక్టర్ దానేటి శ్రీధర్‌ను కలిసిన నాయకులు

జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ నాయకుడు, డాక్టర్ దానేటి శ్రీధర్‌ను శ్రీకాకుళం పట్టణంలో పార్టీ మండల నాయకులు మంగళవారం మర్యాద పూర్వంగా కలిశారు. మండలంలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలన్నారు. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. నిరుపేద ప్రజల కోసం ప్రత్యేక సేవలను ఏర్పాటు చేయాలని పేడాడ శ్రీరామ్మూర్తి, సాకేటి నాగరాజు, చిత్తిరి మోహన్, కర్రి వైకుంఠేశ్వరరావు కోరారు.

బెదిరించిన ఇద్దరిపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైమ్: ఇంటి నిర్మాణం చేపడుతుంటే ఓ పత్రిక విలేకరి ఎం.వి.మల్లేశ్వరరావు (సాక్షి కాదు), సిరిగిరి చైతన్య రూ. 50 వేలు డిమాండ్ చేస్తున్నారని నగరంలోని శాంతినగర్‌కాలనీకి చెందిన బిడ్డక విజయశాంతి ఫిర్యాదు చేసినట్టు రెండో పట్టణ పోలీసులు మంగళవారం తెలిపారు. డబ్బులు ఇవ్వకపోతే మున్సిపల్ అధికారులతో చెప్పి ఇంటిని కూల్చేస్తామని బెదిరించడంతోపాటు కులం పేరుతో దూషించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రెండో పట్టణ సీఐ పప్పల శ్రీనివాసరావు చెప్పారు.

తృణధాన్యాల ప్రదర్శన



చిరుధాన్యాల స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న ప్రసూన్ కుమార్

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని గురజాడ గాయత్రి కళాశాలలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ అనుబంధంగా ఉన్న భాస్కర ప్రకృతి వ్యవసాయ రైతుల సేవాసంస్థ ఆధ్వర్యంలో తృణధాన్యాల ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 14వ బెటాలియన్ ఎన్‌సీసీ శ్రీకాకుళం కమాండింగ్ అధికారి కల్నన్ ప్రసూన్ కుమార్ హాజరయ్యారు. పలు రకాల తృణ, చిరు ధాన్యాలను ప్రదర్శించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుత కాలంలో చాలామంది జంక్‌ఫుడ్‌కు అలవాటు పడుతన్నారన్నారు. చిరు ధాన్యాలతో చేసిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు, కరస్పాండెంట్ అంబటి రంగారావు, కళాశాల ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు ఉన్నారు.

జేసీఎస్ జిల్లా కన్వీనర్‌కు సత్కారం



శివకుమార్‌ను సత్కరిస్తున్న మండల నాయకులు

జి.సిగడాం: నూతనంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ జేసీఎస్ జిల్లా కన్వీనర్ పిల్లల శివకుమార్‌కు మంగళవారం సంతవురిటి గ్రామంలో పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. పార్టీని అన్ని విధాలా బలోపేతం చేయడానికి కృషి చేస్తానని శివకుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, జేసీఎస్ మండల కన్వీనర్ జోల వెంకటరమణ, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ వాండ్రంగి అరుణకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ లా నేస్తం ఎంతో ఉయోగకరం



హర్షం వ్యక్తం చేస్తూ మాట్లాడుతున్న ఎన్ని సూర్యారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ న్యాయవాదులకు వైఎస్సార్ లా నేస్తం ద్వారా చెల్లించే ఆర్థిక సహాయం ఏంతో ఉపయోగకరమని శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం వారు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా జూనియర్ న్యాయవాదులకు వైఎస్సార్ లా నేస్తం ద్వారా ఆర్థిక సహాయం అందించడం గొప్ప విషయమన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ముందు చూపుతో ఎన్నో రకాల పథకాలు అమలు చేస్తున్నారన్నారు. జిల్లాలో లా నేస్తం ద్వారా 58 మందికి సాయం అందించడం హర్షణీయమన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి

● టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్



మాట్లాడుతున్న టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

పాతపట్నం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను పూర్తిచేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. పాతపట్నం మండల కేంద్రంలోని బీసీ కమ్యూనిటీ హాల్‌లో భూ రీసర్వేపై పాతపట్నం, ప్రహరాజపాలెం రైతులతో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. రైతులు రీసర్వేకు పూర్తిగా సహకరించాలన్నారు. రీసర్వేలో ప్రస్తుతం ఉన్న రైతులు తమ పేరుతో రికార్డులు నమోదు చేసుకోవాలన్నారు. పాత రికార్డుల్లో పేర్లు తమ కుటుంబ సభ్యులు ఉంటారని, ఇప్పుడు మీ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వారసత్వ భూములకు మీ పేరు పెట్టుకోవాలన్నారు. రెవెన్యూ పరిధిలోని ఉన్న రైతులు తమ పేర్లు సరి చూసికోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవిచంద్ర, డీటీ ప్రసాదరావు, ఎంపీటీసీ పి.రేణుక, ఎస్.జోగారావు, పి.మోహన్, ఎ.లోకనాథం, రాజారావు, కర్రెన్న, నరేష్, పాతపట్నం, కాపుగోపాలపురం, హరిజన గోపాలపురం, ప్రహరాజపాలెం, కొడూరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలతో పారదర్శకత

జలుమూరు: ఉపాధి పనుల నిర్వహణ అనంతరం సామాజిక తనిఖీలు, అడిట్ చేపట్టడంతో మరింత పారదర్శకత ఉంటుందని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. జలుమూరులోని ఉపాధి కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ సభకు హాజరయ్యారు. శతశాతం ఉపాధి పనులు కల్పించేలా క్షేత్ర, సాంకేతిక సిబ్బంది బాధ్యతతో పని చేయాలన్నారు. ఎక్కువగా మస్టర్లలో సంతకాలు లేకపోవడం, నేమ్ బోర్డులు పని దగ్గర లేనట్లు సోషల్ ఆడిట్ బృందం గుర్తించినట్లు నివేదికల్లో వెల్లడైందన్నారు. అల్లాడపేటకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ పంగ వెంకటరమణ వేతనదారులకు ఉపాధి కల్పించడం, రికార్డుల నిర్వహణ పక్కాగా చేయడంపై అభినందించారు. గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది వరకు మొత్తం 1562 పనులు జరగ్గా వేతనదారులకు రూ.18,76,19,947 చెల్లించామన్నారు. మెటీరియల్‌కు రూ.3,38,93,026 చెల్లించినట్లు ఎస్ఆర్పీ వెంకటరమణ తెలిపారు. పూర్తి స్థాయి నివేదిక అనంతరం ఎంతమేర అవినీతి జరిగింది, ఇందులో అపరాధ రుసుం ఎంత అన్నది బుధవారం తెలియజేస్తామన్నారు. ఎంపీపీ వాన గోపి, జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు, పాతపట్నం, నరసన్నపేట ఏపీడీలు పంచాది రాధ, మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, ఈసీ సోమేశ్వరరావు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ఆమదాలవలస: స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక మంగళవారం నిర్వహించారు. విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ హాజరయ్యారు. మండలంలోని దూసి గ్రామానికి చెందిన జె.త్రినాథరావు వ్యవసాయ బోర్‌వెల్ సర్వీస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆమదాలవలస పట్టణంలో కొత్తగా విద్యుత్ సర్వీస్ కోసం జె.వెంకటరావు దరఖాస్తు అందించారు. ఆధార్ డీ-సీడింగ్ చేయాలని మరో ఇద్దరు విన్నవించారు. ఈ సమస్యలు సత్వరం పరిష్కరిస్తామని సత్యనారాయణ అన్నారు. ఆమదాలవస పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో విద్యుత్ సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఫోరం మెంబర్ ఎస్.హరిబాబు, విద్యుత్ శాఖ ఏఈ రామారావు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో పీఓ పర్యటన



గిరిజనులతో మాట్లాడుతున్న పీఓ

హిరమండలం: మండలంలోని పెద్దగూడ పంచాయతీ పరిధి పెద్దగూడ, పొలంగూడ గిరిజన గ్రామాల్లో సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి మంగళవారం పర్యటించారు. ఏయే పంటలు పండిస్తున్నారు, పంటలు ఎక్కడ విక్రయిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. చీపురు, జీడి, పసుపు, చింత, అల్లం పండిస్తున్నట్లు గిరిజన రైతులు తెలిపారు. సరైన మార్కెట్ సదుపాయంలేక దళారులకే విక్రయిస్తున్నామన్నారు. పసుపు ప్రోసెసింగ్ మిషన్ కూడా ఉందని, ప్యాకింగ్ కవర్లు, మార్కెటింగ్‌పై అవగాహన లేదన్నారు. పండించిన పంటలకు మార్కెటింగ్, గ్రేడింగ్ చేసే విధానాలపై శిక్షణ ఇప్పిస్తామని పీఓ చెప్పారు. కొండూరు జీపీఎస్ పాఠశాలకు మెట్లు, తాగునీటి సదుపాయం కల్పిస్తామన్నారు. సర్పంచ్ నందిని, ఎంపీటీసీ లక్ష్మణ్, మర్రిగూడ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.